క్లుప్తంగా

సామాజిక సేవలో బ్యాంకు ఉద్యోగులు



అన్నదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): సామాజిక సేవలో బ్యాంకు ఉద్యోగులు చురుకైన పాత్ర పోషిస్తున్నారని, గత ఏడేళ్లుగా అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారని తిరుపతి బ్యాంకు ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ధన్వంత్ కుమార్, అధ్యక్షుడు విజయభాస్కర్ అన్నారు. ఆదివారం కార్తీక మాసం సందర్భంగా భక్తులకు తిరుపతిలోని కపిలతీర్థం వద్ద కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రజలకు వివిధ సేవలు అందిస్తున్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, జనార్దన్, సుమలత, రేష్మ, నందగోపాల్, మహేష్, కేశవరెడ్డి, నిర్మల, యజ్ఞేష్‌బాబు, పవన్, లక్ష్మీపతి, ఇతర బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

జనవరి 21న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

తిరుపతి కల్చరల్: తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో జనవరి 21వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడలోని వైఖానస కల్యాణ వేదికలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు భీమాస్ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహ పరిచయ వేదికతో పాటు ఇదే రోజు ఉదయం 6 గంటలకు బ్రాహ్మణులకు షష్టిపూర్తి, భీమరథ శాంతి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని బ్రాహ్మణ కుటుంబ సభ్యులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో పాల్గొనదలచిన వారు 90301 77388, 99493 39851 నంబర్లలో సంప్రదించి, తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

జేసీఐ అధ్యక్షుడిగా చైతన్య తేజ్



ప్రమాణస్వీకారం చేస్తున్న చైతన్య తేజ్

తిరుపతి కల్చరల్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ భారతి, జేసీ నేషనల్ డైరెక్టర్ ఎన్‌టీ.హర్షవర్ధన్‌రెడ్డి నేషనల్ వైస్ చైర్మన్ కిరణ్, జోన్ ప్రెసిడెంట్ కె.క్రిష్ణభాస్కర్ హాజరై నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించారు. జేసీఐ నూతన అధ్యక్షుడిగా చైతన్య తేజ్, కార్యదర్శిగా శేషసాయి, ఉపాధ్యక్షులుగా జయలక్ష్మీతేజ, ఎండీ రాజు, సుమయ్య, రత్నశేఖర్, చరణ్, తహసున్నీషా ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా దిలీప్ కుమార్‌తో పాటు ఉప కార్యదర్శులు, డైరెక్టర్లు ప్రమాణం చేశారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గం సమాజ సేవలను మరింత విస్తృతం చేసి సంస్థ బలోపేతానికి తోడ్పడాలని సూచించారు. బీటెక్ చదువుతున్న పేద విద్యార్థిని పసుపులేటి జాహ్నవికి కళాశాల ఫీజు కోసం జేసీఐ సభ్యులు సేకరించిన రూ.82,650 మొత్తాన్ని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆనందగిరిపై కల్యాణోత్సవం

పాకాల: ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో షష్ఠి సందర్భంగా సోమవారం స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ కళ్యాణోత్సవంలో పాల్గొనేవారు రూ.1,116 చెల్లించాలని తెలిపారు. అలాగే 54 అడుగుల సుబ్రమణ్య స్వామి విగ్రహ నిర్మాణానికి సహకరించిన విరాళ దాతలు ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చని, వారు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే ప్రతీ ఒక్కరికి సుబ్రమణ్య స్వామి తీర్థ ప్రసాదాలతో పాటు, స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ప్రసాదాలను కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓ యువరాణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కండలేరులో 13.118 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 13.118 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనా ల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అవన్నీ నిరాధార ఆరోపణలు

- అసత్య ప్రచారాలతో గంగమ్మ ఆలయ ప్రతిష్టను దిగజార్చకండి
- ఆధారాలు ఇవ్వడానికి మేము సిద్ధం
- గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్



మాట్లాడుతున్న గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం గురించి పత్రికల్లో వస్తున్న ప్రచారాలు నిరాధారమైనవని ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయంలో రూ.2 కోట్లు గోల్‌మాల్ అని ప్రచురితమైన కథనంలో వాస్తవం లేదన్నారు. ఈ ఆరోపణలు రావడంతో భక్తుల కోసం ఆలయ ప్రతినిధులుగా తాము వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనవసరంగా అమ్మవారి ఆలయం గురించి నిరాధార ఆరోపణలు చేస్తే జీవితాలు కోల్పోతారని, అమ్మవారితో ఆటలాడడం మంచిది కాదని హెచ్చరించారు. ఆలయ పునఃనిర్మాణం కోసం దేవదాయ శాఖ నుంచి నిధుల మంజూరుకు అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణ పనులు చేపడుతున్నామని అన్నారు. అమ్మవారి ఆలయంలో వెండి ఆభరణాలు మాయం అన్నది వాస్తవం కాదని, ఆలయానికి సంబంధించిన వెండి, బంగారు ఆభరణాలు, భక్తులు సమర్పించిన కానుకలు బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన ఎఫ్‌డీల వరకు అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. సందేహం ఉంటే వీటిని చూపడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. కొంతమంది అసత్య ప్రచారాలు చేస్తూ, తమ నుంచి ఎలాంటి వివరణ తీసుకోకుండా గంగమ్మ ఆలయ ప్రతిష్టను దిగజార్చుతున్నారని, ఆ విధానాన్ని మానుకోవాల్సిన అవసరం వారిపై ఉందన్నారు. ఇక ఆలయ పునఃనిర్మాణం కోసం అనుసరించాల్సిన అన్ని పద్ధతుల ద్వారానే దేవదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మేరకు మంజూరైన నిధులతోనే ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అమ్మవారి జాతరకు రూ.5 లక్షలు, కార్పొరేషన్ రూ.25 లక్షలు, తుడా రూ.25 లక్షలు, ఆప్కాస్ రూ.10 లక్షలు, క్రెడాయి రూ.5 లక్షలు ఇచ్చాయన్నారు. ఇలా జాతరకు ఖర్చు చేసిన వివరాలు అన్నీ కూడా ఉన్నాయని తెలిపారు. రూ.1.15 కోట్లతో అంగరంగ వైభవంగా జాతర నిర్వహించడంతో పాటు మే 1 నుంచి 5వ తేదీ వరకు ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం ఘనంగా చేపట్టామన్నారు. ఆలయంలో జరిగే ప్రతి పనికి, కార్యక్రమానికి సంబంధించిన ఖర్చులను నిబద్ధతతో చేయడంతో పాటు ఇందుకు సంబంధించిన వివరాలు రికార్డుల పూర్వకంగా ఉన్నాయని తెలిపారు. ఎవరో ఏదో చెబితే పనులు జరుగుతాయనే రోజులు పోయాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. అమ్మవారి ఖ్యాతి, కీర్తిని పెంచేలా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. సమావేశంలో గంగమ్మ ఆలయ ఈవో మమత, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, ధనశేఖర్, రమణమ్మ, భారతి పాల్గొన్నారు.

గవర్నర్ సభా ఏర్పాట్ల పరిశీలన



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

తిరుపతి సిటీ: తిరుపతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియం వేదికగా సోమవారం జరగనున్న వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సభా ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మన సంకల్పం – అభివృద్ధి చెందిన భారత్ అనే నినాదంతో వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సభకు హాజరయ్యే వీఐపీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పథకాల వివరాల గురించి తెలియజేసే స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈలు సంజయ్ కుమార్, రాజు, అధికారులు పాల్గొన్నారు.

త్వరగా ఓటరు దరఖాస్తులను పరిష్కరించండి

తిరుపతి రూరల్: ప్రత్యేక ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తిరుపతి ఆర్డీఓ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో కొత్తగా ఓటరు కోసం వచ్చిన 2,400 దరఖాస్తులను, ఓటరు తీసివేయడానికి వచ్చిన 900కు పైగా దరఖాస్తులను వారం రోజుల్లో విచారించి పూర్తి చేయించాలని ఆదేశించారు. కొందరు బీఎల్వోలు దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపడంపై మండిపడ్డారు. తీరు మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ఫొటో సిమిలర్, డెమోగ్రాఫికల్ ఓటర్లను గుర్తించి చిత్తశుద్ధితో విచారించాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి రూరల్ తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం, ఆర్ఐ శివకుమార్, బీఎల్వోలు పాల్గొన్నారు.

వారపు సంతలో అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చంద్రగిరి: వారపు సంతలో వ్యాపారాలు చేసుకునే రైతన్నలకు, వ్యాపారస్తులకు తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 నుంచి 4 గంటల వరకు 500 మందికి అన్నదానం చేసినట్లు పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా ప్రతి ఆదివారం సంతలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ దూర ప్రాంతాల నుంచి వ్యాపారాలు చేసుకునే వర్తకులు, రైతులకు మధ్యాహ్నం ఆకలితో పస్తులుండకూడదనే ఉద్దేశంతో తమ నాయకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంకల్పించారన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఆదివారం రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల నాట్య ప్రదర్శన



తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్యం అలరించాయి. తిరుపతికి చెందిన శ్రీపదమ భరతనాట్యం డ్యాన్స్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన భరత నాట్యం ఆకట్టుకుంది. ఇందులో భాగంగా ఏకదంతాయ, నారాయణతే నమోనమో, నాగులమ్మ, పుష్పాంజలి, ముద్దుగారే యశోద, వేయినామాల వాడా, ఓం నమఃశివాయ తదితర పాటలకు కళాకారులు సువలక్ష్మీ, రిషిత, నందిని, దనివ్రత, తేజ, మంజరి, మహాలక్ష్మి, రజిత, హిమశ్రీ, యమున, రిషిత, తేజశ్రీ, చందన, స్మిత, దీప్తి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలరాముని విజయ యాత్రకు శ్రీకారం



విజయయాత్ర రథం వద్ద నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : భార్గవి పిక్చర్స్ నిర్వహణలో ధాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు ప్రతాప్ స్వామీజీ అయోధ్యకు చేపట్టిన బాలరాముని విజయయాత్ర ఆదివారం తిరుపతిలో ప్రారంభమైంది. ముందుగా బాలరాముని విగ్రహంతో కూడిన రథానికి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. ప్రతాప్ స్వామీజీ మాట్లాడుతూ తాము తీసుకెళుతున్న బాలరాముని విగ్రహాన్ని అయోధ్యలోని ఆలయ ప్రాంగణంలో ఏదో ఒక చోట ప్రతిష్ఠించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, బీజేపీ నేతలు మునికృష్ణ యాదవ్, టి.సుబ్రమణ్యంరెడ్డి, చెంగారెడ్డి, కె.కల్యాణి, రంగస్థలి కార్యదర్శి కేఎస్ రాజా పాల్గొన్నారు.



స్వామివారికి వెండి తట్టను అందజేస్తున్న దాత సుబ్బారెడ్డి



ఆలయ అధికారులకు విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

వరసిద్ధునికి విరాళాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక దేవాస్థానానికి నిత్యాన్నదానానికి రూ.లక్ష, వెండి హారతి పళ్లెం ఆదివారం విరాళాలుగా అందాయి. బెంగళూరుకు చెందిన సుబ్బారెడ్డి సుమారు రూ.75 వేల విలువైన కిలో వెండి తట్టను వితరణ చేశారు. ఉదయం ఆలయానికి విచ్చేసి అధికారులకు అందజేశారు. అలాగే నిత్యాన్నదానానికి నెల్లూరుకు చెందిన కోదండరామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు విగ్నేష్, రమేష్ పాల్గొన్నారు.



కాకినాడ ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

వినాయకుని సేవలో కాకినాడ ఎమ్మెల్యే

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం మాజీ మంత్రి, కాకినాడ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు వచ్చిన వారికి ఏఈవో హరిమాధవ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులతో ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు ఘన సన్మానం



డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని సన్మానిస్తున్న కురుబ సంఘం నేతలు

తిరుపతి తుడా : కేటీ రోడ్డులోని అన్నారావు సర్కిల్ నుంచి ఖాదీ కాలనీ మీదుగా నెహ్రూ మున్సిపల్ పార్క్, తిరుమల బైపాస్ రోడ్డుకు కలుపుతూ విస్తరణ చేస్తున్న రోడ్డుకు ప్రఖ్యాత వాగ్గేయకారుడు కనకదాసు పేరును మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్లో ఆమోదించింది. దీంతో కురుబ సంఘం నాయకులు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డిని ఆదివారం గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో రిటైర్డ్ డీఎస్పీ నంజుండప్ప, మంజరి రెడ్డెప్ప, శ్రీనివాసులు, మల్లి, రఘురాం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి వైభవాన్ని చాటిన సుబ్రమణ్య శాస్త్రి





మాట్లాడుతున్న శాసన పరిశోధకుడు కృష్ణారెడ్డి, సుబ్రమణ్యశాస్త్రికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి ఆలయ చరిత్రను, శ్రీవేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సాధు సుబ్రమణ్య శాస్త్రి అని ప్రముఖ శాసన పరిశోధకుడు తొండవాడ సారకాయల కృష్ణారెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాధు సుబ్రమణ్యశాస్త్రి 135వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి ఆలయం ఉన్నంతవరకు ఆయన చిరంజీవిగా నిలుస్తారన్నారు. టీటీడీలో చిన్నస్థాయి ఉద్యోగిగా ఉంటూ వెయ్యికి పైగా శాసనాలను వెలికితీసి పరిష్కరించిన గొప్ప వ్యక్తి సుబ్రమణ్యశాస్త్రి అని చెప్పారు. అన్నమయ్య రచించిన 32 వేల సంకీర్తనల్లో 12 వేల సంకీర్తనలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో అధిక భాగం సంకీర్తనలను శాస్త్రి పరిష్కరించి సమాజానికి అందించారని వివరించారు. దీనికి ముందు టీటీడీ సీఏఓ శేషశైలేంద్ర మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి అమూల్యమైన సేవలందించిన సాధు సుబ్రమణ్యశాస్త్రి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ వంటి మహానుభావుల జీవితాలను, వారు చేసిన కృషిని విద్యార్థులు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. అలాగే సాధు సుబ్రమణ్యశాస్త్రి వెలికితీసి పరిష్కరించిన శాసనాల పుస్తకాలను పిల్లలు, పెద్దలు కూడా చదవాలన్నారు. అంతకుముందు సాధు సుబ్రమణ్య శాస్త్రి జయంతి సందర్భంగా శ్వేత భవనం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి సీవీఅండ్ఎస్ఓ నరసింహ కిషోర్, టీటీడీ పీఆర్ఓ డాక్టర్ టి.రవి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో శాస్త్రి కూతురు గిరిజ, మనుమడు, జడ్జి శ్రీమూర్తి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ పాల్గొన్నారు.

యుమిడి కార్డు ఉంటేనే వైద్య సేవలు



సీనియర్ పెన్షనర్స్‌ని సత్కరిస్తున్న నాయకులు

పాకాల: రైల్వే కమ్యూనిటీ హాలులో ఘనంగా రైల్వే పెన్షనర్స్‌డే 39వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షుడు జయంత్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే పెన్షనర్ల సమస్యలు రైల్వే అదాలత్‌లో పరిష్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పెన్షనర్స్ చీఫ్ ఆర్గనైజర్ చెరుకూరి గురవయ్యానాయుడు మాట్లాడుతూ పెన్షన్ పేమెంట్ ఆర్డర్(పీపీఓ) రాక చాలా మందికి యుమిడి కార్డులు రావడం లేదని వాపోయారు. యుమిడి కార్డు ఉంటేనే వైద్య సేవలు పొందేందుకు వీలవుతుందని వివరించారు. ఈ విషయంపై అధికారులు స్పందించి పెన్షనర్స్‌కు న్యాయం చేయాలని కోరారు. ప్రతీ నెల మొదటి శనివారం పెన్షనర్ల సమస్యల అర్జీలను స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో స్వీకరిస్తున్నట్లు కార్యదర్శి రాము(రామయ్య) తెలిపారు. అనంతరం సీనియర్ పెన్షనర్స్ ఖాదర్‌బాషా, రామచంద్రనాయుడులకు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆల్బర్ట్, పట్టాభిశెట్టి, సుబ్రమణ్యం, రంగయ్య, సత్యనారాయణశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు



భగవద్గీత శ్లోకాలు ఆలపిస్తున్న విద్యార్థి

తిరుపతి కల్చరల్: గీతా జయంతి సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. 700 శ్లోకాలు కంఠస్థం వచ్చిన వారిలో 18 ఏళ్లు పైబడిన కేటగిరీలో 10 మంది, 18 ఏళ్లలోపు కేటగిరీలో 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 6, 7 తరగతుల నుంచి 89 మంది, 8, 9 తరగతి చదువుతున్న 47 మంది విద్యార్థులు హాజరయ్యారు. తిరుపతి జిల్లా పరిధిలోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని భగవద్గీత శ్లోకాలను వినసొంపుగా ఆలపించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి సోమయాజులు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలకు 12 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 23వ తేదీన జరిగే గీతా జయంతి వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

106 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు




ఉచిత కంటి వైద్య పరీక్షలు అందిస్తున్న వైద్యులు

పాకాల: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 106 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్య బృందం, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సహాయ సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 106 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను సరఫరా చేశారు. అలాగే 16 మందిని ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కోశాధికారి మారసాని నాగేంద్ర, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్స్ కె.ఎస్.మస్తాన్, రామయ్య, లయన్ ప్రతినిధులు గురుస్వామినాయుడు, దొరస్వామి నాయుడు, తులసీరామన్, జి.వి.ప్రసాద్, అనీల్ కుమార్, మహేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా యాన్యువల్ మీట్ ఫర్ సీఎల్‌హెచ్‌ఏ

తిరుపతి కల్చరల్: లవ్ ఇన్ యాక్షన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పేడులోని డేవిడ్‌రీష్ హాస్పిటల్‌లో ఆదివారం యాన్యువల్ మీట్ ఫర్ సీఎల్‌హెచ్‌ఏ–2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎల్‌హెచ్‌ఏకి సంబంధించిన బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఆర్‌ఆర్ రెడ్డి, డాక్టర్ వై.ప్రవీణ్, ఏడీ రంగరాజన్ హాజరు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌ఆర్ రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ నిర్వహించే కార్యక్రమాలలో తాను పదేళ్లు పని చేశానన్నారు. రానున్న రోజుల్లో ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పి.రమేష్, పి.సుధాకర్, వి.రామచంద్రయ్య, ఎ.విజయ్ కుమార్, బాలికలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ఆర్‌ఆర్ రెడ్డి